క్లుప్తంగా

సీఎం పర్యటనను విజయవంతం చేయండి

వెదురుకుప్పం: ఈ నెల 4న చిత్తూరుకు రానున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పర్యటనను విజయవంతం చేయాలని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి బండి హేమసుందర్‌రెడ్డి అన్నారు. శనివారం వెదురుకుప్పంలో ఆయన పార్టీ నాయకులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ 25 గ్రామ పంచాయతీల నుంచి 4న ఉదయం 7 గంటలకు ఆయా పంచాయతీలకు కేటాయించిన బస్సుల్లో చిత్తూరుకు బయలు దేరాలని సూచించారు.

నేటితో ఉత్సవాల ముగింపు

వెదురుకుప్పం: మండలంలోని పచ్చికాపల్లం ద్రౌపదీ సమేత ధర్మరాజుల ఆలయంలో జరుగుతున్న మహాభారత ఉత్సవాలు ఆదివారం దుర్యోధన వధతో ముగియనుంది. పది రోజుల పాటు ఉత్సవాలు నిర్విరామంగా సాగుతున్నాయి. ఆదివారం దుర్యోధన వధ, ధర్మరాజుల పట్టాభిషేకం, సాయంత్రం అమ్మవారి అగ్నిగుండ ప్రవేశంతో పరిసమాప్తి అవుతుంది.

రుయాలో పెన్షన్ అందజేత


అమాసయ్యకు పెన్షన్ అందిస్తున్న వలంటీర్

నగరి : మండలంలోని గుండ్రాజుకుప్పం హరిజనవాడకు చెందిన అమాసయ్య గుండె సంబంధిత వ్యాధితో తిరుపతి రుయాలో చికిత్స పొందుతున్నారు. తీవ్ర అస్వస్థతతో చికిత్స పొందుతున్న అమాసయ్యను వెతుక్కుంటూ వలంటీర్ ప్రశాంత్ శనివారం ఆస్పత్రికి చేరుకుని పెన్షన్ అందజేశారు.

ఆక్రమణల తొలగింపు


జేసీబీతో సంతమైదానాన్ని చదును చేస్తున్న దృశ్యం

నగరి : సంతమైదానంలోని ఆక్రమణలను సీఐ శ్రీనివాసంతి శనివారం తొలగించారు. సంతమైదానంలో ఎడాపెడా దుకాణాలు ఏర్పాటు చేసుకోవడంపై ఫిర్యాదులు వచ్చాయి. ఈ నేపథ్యంలో సీఐ నేతృత్వంలో ఆక్రమణలను తొలగించి జేసీబీ సాయంతో చదును చేశారు.

3, 4 వార్డుల్లో జగనన్న సురక్ష రేపు

నగరి : మున్సిపాలిటీకి చెందిన 3, 4 వార్డుల్లో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ వెంకట్రామిరెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం కేశింమిట్ట సచివాలయ పరిధిలో జరిగే ఈ కార్యక్రమంలో మున్సిపల్ పాలకవర్గ సభ్యులతో పాటు, తహసీల్దార్, వివిధ విభాగాల అధికారులు పాల్గొంటారని పేర్కొన్నారు.

భోజనం ప్లేట్ల వితరణ


ప్లేట్లు అందిస్తున్న రిటైర్డ్ హెచ్‌ఎం నాగరాజు

విజయపురం : మండలంలోని జంబాడ ఉన్నత పాఠశాలలో చదువుతున్న 160 మంది విద్యార్థులకు రిటైర్డు హెచ్‌ఎం నాగరాజు శనివారం తన పుట్టిన రోజు సందర్భంగా భోజనం ప్లేట్లు అందించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం శ్రీనివాసులు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆకాశంలో అద్భుత వలయం


ఆలయంలో ధ్వజస్తంభం పైనుంచి కనిపిస్తున్న సూర్య వలయం

నగరి : పట్టణ పరిధిలో టీటీడీ ఆధీనంలో ఉన్న కరియమాణిక్య స్వామి ఆలయ ధ్వజస్తంభం పైనుంచి ఆకాశంలో కనిపించిన అద్భుత వలయం పలువురిని అబ్బుర పరచింది. దీనిపై విజ్ఞాన వేత్తలు మాట్లాడుతూ సూర్యుని చుట్టూ ఏర్పడిన ఈ కాంతి వలయాన్ని సంస్కృతంలో పరివేషమని, తెలుగులో వరదగుడి అని పిలుస్తారన్నారు. సూర్యుని చుట్టూ గానీ చంద్రుని చుట్టూ గానీ ఇలాంటి వలయం దగ్గరగా ఏర్పడితే బలమైన వానకు సూచన అని, కాస్త దూరంగా ఏర్పడితే గాలి బలంగా వీస్తుందని సంకేతమన్నారు.

ట్రైన్‌లో పూడుపాము లభ్యం


పామును చూపుతున్న అటవీ, ఆర్పీఎఫ్ సిబ్బంది

పుత్తూరు రూరల్: రేణిగుంట రైల్వేస్టేషన్ నుంచి శనివారం ఉదయం 9 గంటలకు ముంబై నుంచి చెన్నైకి వెళ్తున్న లోకమాన్య తిలక్ ఎక్స్‌ప్రెస్‌లో కోచ్ నంబర్ ఎస్6లో టీసీ ఓ గుర్తు తెలియని బ్యాగులో పామును గుర్తించాడు. సమాచారాన్ని పుత్తూరు రైల్వే ఆర్పీఎఫ్ పోలీస్ సిబ్బందికి కంట్రోల్ మెసేజ్ చేశాడు. పుత్తూరులో ట్రైన్ ఆగగానే స్థానిక ఆర్పీఎఫ్ ఏఎస్ఐ పరశురామ్ ద్వారా సమాచారం అందుకున్న స్థానిక అటవీశాఖ అధికారి మాధవి, స్నేక్ క్యాచర్ శ్రీకాంత్ బ్యాగులో చూడగా 7 కిలోల బరువు గల పూడుపాము ఉంది. పామును సదాశివకోనలో సురక్షితంగా వదిలి పెట్టినట్లు ఎఫ్ఆర్ఓ మాధవి తెలిపారు.

ప్రజల సంక్షేమం.. ప్రభుత్వ లక్ష్యం


ఎం.కొత్తూరులో లబ్ధిదారుడికి సర్టిఫికెట్ అందిస్తున్న మంత్రి సోదరుడు రామ్‌ప్రసాద్‌రెడ్డి


పుత్తూరులో ధ్రువీకరణ పత్రాలు అందుకున్న మహిళలతో రామ్‌ప్రసాద్‌రెడ్డి

- ప్రజలను వెతుక్కుంటూ వచ్చిన ప్రభుత్వం
- సచివాలయాల వద్దే సమస్యల పరిష్కారం
- రూపాయి ఖర్చు లేకుండా ధ్రువీకరణ పత్రాల అందజేత
- తొలిరోజు నగరి నియోజకవర్గంలో 2,402 సమస్యల పరిష్కారం
- ప్రతిష్టాత్మకంగా నిలుస్తున్న జగనన్న సురక్ష


కాకవేడులో లబ్ధిదారురాలికి సర్టిఫికెట్ అందిస్తున్న మున్సిపల్ చైర్మన్ పీజీ నీలమేఘం


వడమాలపేటలో ధ్రువీకరణ పత్రాలు అందిస్తున్న సురేష్‌రాజు

నగరి : అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ ఫలాలు అందాలన్న సత్సంకల్పంతో ప్రభుత్వం ప్రవేశపెట్టిన జగనన్న సురక్ష కార్యక్రమం ప్రతిష్టాత్మకంగా నిలిచింది. నెలరోజుల పాటు నిర్వహించనున్న ఈ కార్యక్రమంలో భాగంగా తొలిరోజు మున్సిపల్ పరిధిలోని 1, 2వ వార్డులకు సంబంధించి కాకవేడు సచివాలయం వద్ద, మండల పరిధిలో ఎం.కొత్తూరు సచివాలయం వద్ద జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. దీంతో ఆయా ప్రాంతాల్లో జనజాతర కనిపించింది. ఇప్పటి వరకు చరిత్రలో లేనివిధంగా ఇంటివద్దకే వచ్చి సమస్యలు తెలుసుకోవడంతో పాటు అవసరమైన ఆదాయ, కుల ధ్రువీకరణ పత్రాలు, కొత్త రేషన్ కార్డులు, విభజించిన రేషన్‌కార్డులు, పట్టాదారు పాసుపుస్తకాలు, వివాహ ధ్రువీకరణ పత్రాలు, అదనపు పేర్లు నమోదు చేసిన రేషన్ కార్డులు, అప్‌డేట్ చేసిన ఆధార్ కార్డులు ఎలాంటి రుసుము లేకుండా ఉచితంగా ప్రజలను వెతుక్కుంటూ వారి చెంతకే వచ్చాయి. నగరి నియోజకవర్గంలోని 5 మండలాలు, రెండు మున్సిపాలిటీల్లో తొలిరోజు నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో 2402 సమస్యలు పరిష్కారమయ్యాయి. ఎం.కొత్తూరు సచివాలయం వద్ద ఏర్పాటు చేసిన క్యాంపులో మంత్రి ఆర్కే రోజా సోదరులు రామ్‌ప్రసాద్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని 255 కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, 6 ఫ్యామిలీ మెంబర్స్ ధ్రువీకరణ పత్రాలు, అదనపు సభ్యుల నమోదుతో, విభజనతో, హౌస్‌హోల్డ్ విభజనతో కలిపిన 30 రేషన్ కార్డులు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్న చేపడుతున్న కార్యక్రమాలు నభూతో నభవిష్యత్ అన్నారు. టీడీపీ వారు అధికారంలో ఉన్న రోజుల్లో ఇప్పుడు సీఎం జగనన్న అమలు చేస్తున్న పథకాల్లో కనీసం ఒక్క శాతమైనా చేశారా ? అని ప్రజలు ఆలోచించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ లీలామాధవి, ఎంపీపీ భార్గవి, వైస్ ఎంపీపీలు వెంకటలక్ష్మి, కన్నియప్ప, ఆర్బీకే చైర్మన్ బుజ్జిరెడ్డి, మండల సచివాలయ కన్వీనర్ హరి, పశుసంవర్ధక శాఖ ఏడీ వాసు, సర్పంచ్ నరసింహులు, డిల్లీబాబు తదితరులు పాల్గొన్నారు. కాకవేడు సచివాలయం వద్ద ఏర్పాటుచే సిన క్యాంపులో మున్సిపల్ చైర్మన్ పీజీ నీలమేఘం 179 మందికి పలురకాల ధ్రువీకరణ పత్రాలు, 28 రేషన్ కార్డులు, 24 ఆధార్ అప్‌డేషన్ కార్డులు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన రాజకీయ జీవితంలో ప్రజలకోసం ఇన్ని పథకాలు అమలు చేస్తున్న సీఎం జగనన్న లాంటి నాయకున్ని చూడలేదన్నారు.

కార్యక్రమంలో ప్రత్యేక అధికారి శోభన్‌బాబు, మున్సిపల్ కమిషనర్ వెంకట్రామిరెడ్డి, తహసీల్దార్ చంద్రశేఖర్ రెడ్డి, వైస్‌చైర్మన్లు వెంకటరత్నం రెడ్డి, బాలన్, మున్సిపల్ సచివాలయ కన్వీనర్ దయానిధి, మునివేలు, డీఈ నరేష్, ఏఈ రమేష్, సచివాలయ ఇన్‌చార్జి చంద్రకాంత్ తదితరులు పాల్గొన్నారు.

'సురక్ష' దేశానికే ఆదర్శం అవుతుంది

పుత్తూరు రూరల్: జగనన్న సురక్ష పథకం ఒక అద్భుతమని పర్యాటక శాఖ మంత్రి ఆర్కే రోజా సోదరుడు, వైఎస్సార్‌సీపీ నేత వై.రామ్‌ప్రసాద్ రెడ్డి అన్నారు. శనివారం పుత్తూరు మున్సిపాలిటీ 1వ వార్డు పల్లూరు సచివాలయ పరిధిలో జగనన్న సురక్ష క్యాంపు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న రామ్‌ప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ మున్సిపాలిటీ 1వ వార్డులో 635 మంది వివిధ సేవల కోసం అర్జీలు సమర్పించగా 572 మందికి పరిష్కారం చూపినట్లు తెలిపారు. రూరల్ మండలం గోపాలకృష్ణాపురం సచివాలయ పరిధిలో జరిగిన సురక్ష కార్యక్రమంలో 378 అర్జీలకుగానూ 350 పరిష్కరించినట్లు వివరించారు. కార్యక్రమంలో జగనన్న సురక్ష స్పెషల్ ఆఫీసర్ పద్మజ, మున్సిపల్ కమిషనర్ కెఎల్ఎన్‌రెడ్డి, ఎంపీడీఓ ఇందిర, చైర్మన్ ఏ.హరి, వైస్ చైర్మన్ జయప్రకాష్, ఎంపీపీ మునివేలు, వైస్ ఎంపీపీ మునస్వామిరెడ్డి, ఎంఎల్ఓ దిలిప్‌మొదలి, జేసీఎస్ కన్వీనర్లు ఏకాంబరం, భాస్కర్‌యాదవ్, వార్డు కౌన్సిలర్ గుణశేఖర్, సర్పంచులు వేలాయుధం, గోవిందస్వామిరెడ్డి, వసంతమ్మ, ఉప సర్పంచ్ మునిరాజ, కోఆప్షన్ మెంబర్ రాంబత్తయ్య, ఎంపీటీసీ కాంతమ్మ తదితరులు పాల్గొన్నారు.

మండలాల వారీగా పరిష్కరించిన సమస్యలు	
మండలం/ మున్సిపాలిటీ	పరిష్కరించిన సమస్యలు
నగరి మున్సిపాలిటీ	422
నగరి మండలం	291
పుత్తూరు మున్సిపాలిటీ	572
పుత్తూరు మండలం	360
వడమాలపేట మండలం	591
నింద్ర మండలం	122
విజయపురం మండలం	44

వడమాలపేటలో..

వడమాలపేట: మండలంలోని పాదిరేడు సచివాలయ పరిధిలో శనివారం జగనన్న సురక్ష క్యాంపు కార్యక్రమం నిర్వహించారు. సచివాలయ కన్వీనర్ సురేష్ రాజు లబ్ధిదారులకు ధ్రువీకరణ పత్రాలను పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ మొత్తం 688 అర్జీలకు 591 మందికి పరిష్కారం చూపినట్లు తెలిపారు. కార్యక్రమంలో స్పెషల్ ఆఫీసర్ రేణుక, తహసీల్దార్ సుబ్రమణ్యం, నాయకుడు నందయ్య, శేఖర్, కిరణ్, మునెమ్మ, మంజుల, మునిబాబు, సుబ్రమణ్యం రెడ్డి, సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

జనం గుండెల్లో సీఎం జగన్


లబ్ధిదారులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి

- అవినీతి నిర్మూలనకే వలంటీర్ వ్యవస్థ
- అమరావతిలో పేదలకు ఇంటిస్థలాలు అందించిన ఘనత సీఎం జగనన్నదే
- చంద్రబాబుకు ఎస్సీలంటే చులకన, పేదలంటే నచ్చదు
- వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ గెలుపు ఖాయం
- డిప్యూటీ సీఎం నారాయణస్వామి

కార్వేటినగరం: రాష్ట్రవ్యాప్తంగా గ్రామాల్లో ప్రజలు సీఎం జగనన్న జపమే చేస్తున్నారని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కళత్తూరు నారాయణస్వామి అన్నారు. శనివారం ఎంఎం విలాసం సచివాలయం పరిధిలో సర్పంచ్ పవన్‌కుమార్, ఎంపీపీ లత, మండల కన్వీనర్ శేఖర్‌రాజు ఆధ్వర్యంలో మునిరెడ్డి కండ్రిగ, గుండుగాని దళితవాడ, మర్రిమాను ఇండ్లు, కనకమ్మ కండ్రిగ గ్రామాల్లో జరిగిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన ఇంటింటికీ వెళ్లి ప్రజలతో మమేకమై ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను వివరిస్తూ, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి మాట్లాడుతూ గతంలో ఏ ప్రభుత్వం అందించని సంక్షేమాలను రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందించడంతో ఏ గ్రామానికి వెళ్లినా లబ్ధిదారులు సీఎం జగనన్నను గుండెల్లో దాచుకున్నారని అన్నారు. ప్రపంచంలో ఏ ముఖ్యమంత్రి చేపట్టని అభివృద్ధి పనులను సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చేస్తున్నారని, పేదలకు ఆర్థికంగా అండగా నిలవడానికి విద్య, వైద్యం, ఆరోగ్య రంగాలకు పెద్దపీట వేశారని అన్నారు. చంద్రబాబు ఎప్పుడూ ఇలాంటి సంక్షేమ పథకాలు అందించిన దాఖలాలు లేవని అన్నారు. చంద్రబాబు ఎస్సీలకు ఆగర్భ శత్రువని, ఎస్సీల ఎదుగుదల జీర్ణించుకోలేక నారావారిపల్లిలో ఎస్సీలను ఆలయ దర్శనాలకు దూరం చేసిన వ్యక్తి చంద్రబాబు అని అన్నారు. అదే సీఎం జగనన్న అమరావతిలో ఎస్సీలకు వేల సంఖ్యలో ఇళ్ల స్థలాలు అందించి చరిత్ర సృష్టించారని తెలిపారు. అవినీతి లేకుండా ప్రజలకు సేవలు అందించడానికి వలంటీర్ వ్యవస్థను అందుబాటులోకి తీసుకొచ్చారని అన్నారు. అధికారం కోసం ఎస్సీ, ఎస్టీలు, మైనారిటీలు కావాలని, కానీ వారి అభివృద్ధి మాత్రం చంద్రబాబుకు పట్టదన్నారు. ప్రతి సామాజిక వర్గానికి కార్పొరేషన్లు ఏర్పాటు చేసి వారికి ఉన్నత పదవులు అందించిన ఘనత కూడా సీఎం జగనన్నదేనని అన్నారు. చంద్రబాబును నమ్మితే సంక్షేమ పథకాలు ఉండవన్నారు. పవన్‌కల్యాణ్‌కు సినిమాలు చూసి అభిమానులు ఉండవచ్చు కానీ, ప్రజా ప్రతినిధిగా అభిమానులు ఉండ బోరని ఎద్దేవా చేశారు. ప్రజలపై ప్రేమ, వాత్సల్యం ఉన్న వ్యక్తి ఒక్క జగనన్న మాత్రమేనని అన్నారు.

ప్రతి ఇంటికీ శుద్ధ జలం

ప్రతి ఇంటికీ మినరల్ వాటర్ అందించడమే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి అన్నారు. శనివారం చేపట్టిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా మునిరెడ్డి కండ్రిగలో మినరల్ వాటర్ ప్లాంట్‌ను ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో జిల్లా ప్రధానకార్యదర్శి బాలాజీ, రాష్ట్ర యువత ప్రధాన కార్యదర్శి ధనంజయరెడ్డి, వైస్ ఎంపీపీ మణెమ్మ, కోఆప్షన్ మెంబర్ పట్నం ప్రభాకర్‌రెడ్డి, ఎంపీటీసీ దేశమ్మ, చందురాజు, మాజీ సర్పంచ్ దొరస్వామి, కల్లయ్య, రాజ, జయచంద్ర, సింగిల్‌విండో అధ్యక్షుడు లోకనాథరెడ్డి, ఆనందయ్య, ఎంపీడీఓ మోహన్‌మురళి, ఏఈలు యోగేంద్రనాయుడు, రియాజ్, పలువురు నాయకులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

నందీశ్వరునికి ప్రత్యేక అభిషేకాలు


నందీశ్వరుడికి అభిషేకం చేస్తున్న అర్చకుడు

వెదురుకుప్పం: మండలంలోని డీఆర్ఎస్‌కండ్రిగ సమీపంలోని అరుణగిరిపై ఉన్న జ్ఞాన ప్రసూనాంబ సమేత కొండమల్లీశ్వర స్వామి ఆలయంలో శనివారం సాయంత్రం ప్రదోషకాల పూజలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా శివునికి నందీశ్వరునికి ఏక కాలంలో అభిషేకాలు, విశేష పూజలు నిర్వహించారు. అంతకుముందు వేకువజామునే కొండమల్లీశునికి ధూపదీప నైవేద్యాలు సమర్పించారు. ఆలయ ప్రధాన అర్చకులు ఆధ్వర్యంలో స్వామివారిని సర్వాంగ సుందరంగా ముస్తాబు చేసి భక్తి ప్రపత్తులతో పూజలు చేశారు. సాయంత్రం ప్రదోష పూజలనంతరం భక్తులకు దర్శనభాగ్యం కల్పించి తీర్థప్రసాదాలు పంచి పెట్టారు. ఇందులో భాగంగా ఆలయ ఆవరణలో ఉన్న పంచముఖ ఆంజనేయ స్వామికి పూజలు చేశారు. ఆలయ ఆవరణలో చేపట్టిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. భక్తులు విశేషసంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు.

వేణుగోపాలస్వామి సన్నిధిలో అన్నదానం


ఆలయ ఆవరణలో అన్నదానం చేస్తున్న వాహన సేవకులు

కార్వేటినగరం: మండలకేంద్రంలోని ప్రసిద్ధి రుక్మిణీ, సత్యభామ సమేత శ్రీవేణుగోపాలస్వామి ఆలయంలో టీటీడీ ఆలయ అధికారి సురేష్‌కుమార్ ఆధ్వర్యంలో స్వామివారి వాహన సేవకులు శనివారం అన్నదానం చేపట్టారు. ఈ సందర్భంగా ఆలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం టీటీడీ ఆలయ అధికారి సురేష్‌కుమార్ మాట్లాడుతూ పేదలకు అన్నదానం చేయాలనే ఔదార్యం కలిగిన దాతలు ముందుకొచ్చి వేణుగోపాలస్వామి ఆలయంలో ప్రతి శనివారం నిర్వహించే అన్నదాన కార్యక్రమంలో పాలు పంచుకుని తమ దాతృత్వాన్ని చాటుకోవాలని కోరారు. టీటీడీ వారు ప్రారంభించిన అన్నదాన కార్యక్రమాన్ని పేదలు సద్వినియోగం చేసుకోవాలని, ప్రతి శనివారం నిర్వహించే ఈ కార్యక్రమంలో పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలని కోరారు.

అన్నదానానికి రూ.40 వేలు వితరణ..

కార్వేటినగరం ప్రసిద్ధి రుక్మిణీ, సత్యభామ సమేత శ్రీవేణుగోపాలస్వామి వారిని బెంగళూరుకు చెందిన దిలీప్‌కుమార్, దుర్గలక్ష్మి దంపతులు దర్శించుకున్నారు. అనంతరం వారు అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈసందర్భంగా స్వామివారి ఆలయంలో టీటీడీ ఆధ్వర్యంలో చేపడుతున్న అన్నదాన కార్యక్రమానికి రూ.40 వేలు అందించి తమ ఔదార్యాన్ని చాటుకున్నారు. దీంతో ఆలయ అధికారి వారికి స్వామివారి తీర్థ ప్రసాదాలను అందించారు. అలాగే అర్చకులు వేద మంత్రాలతో ఆశీర్వచనలు అందించారు. కార్యక్రమంలో టీటీడీ ఆలయ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.


నగరి కరియమాణిక్యస్వామి ఆలయంలో..

కరియమాణిక్య స్వామి ఆలయంలో..

నగరి : పట్టణ పరిధిలో టీటీడీ అనుబంధంగా ఉన్న కరియమాణిక్య స్వామి ఆలయంలో దాతల సహకారంతో ప్రారంభించిన అన్నదాన కార్యక్రమం శనివారం జరిగింది. ముందస్తుగా పేరు నమోదు చేసుకుని విరాళాలు అందించిన దాతల సహకారంతో అన్నదానం చేస్తున్నట్లు టెంపుల్ ఇన్‌స్పెక్టర్లు వెంకటరమణ, గుణశేఖర్ తెలిపారు. కార్యక్రమంలో దాతలు, భక్తులు పాల్గొన్నారు.

కార్మికులపై ఖాకీల జులుం

– చిదా స్పిన్నింగ్ మిల్లు యంత్రాల తరలింపు


కార్మిక సంఘ నాయకులను అదుపులోకి తీసుకుంటున్న పోలీసులు

పుత్తూరు రూరల్: కార్మికుల మొర వినేవారే కరువయ్యారు. స్థానిక చిదా స్పిన్నింగ్ మిల్లు యాజమాన్య తన 'పలుకుబడి' వినియోగించి చట్ట వ్యతిరేకంగా తన కార్యాన్ని చక్కబెట్టుకుంది. శనివారం మధ్యాహ్నం మిల్లులోని యంత్రాలను తరలించడానికి పక్కా ప్రణాళికను అమలు చేసి విజయం సాధించింది. వివరాల్లోకి వెళ్తే.. గత నెల ఫిబ్రవరి 25వ తేదీన మిల్లును మూసివేస్తున్నట్లు యాజమాన్యం ప్రకటించింది. దీనిపై కార్మిక సంఘాలు డీసీఎల్‌ను ఆశ్రయించాయి. స్పందించిన డీసీఎల్ మిల్లు మేనేజ్‌మెంట్, కార్మిక సంఘ నాయకులతో చర్చలు జరిపింది. యాజమాన్యం, కార్మికుల మధ్య చర్చలు విఫలమయ్యాయి. కార్మికులు ఇచ్చిన ఇండస్ట్రీయల్ డెస్ప్యూట్ కేసును సైతం డీసీఎల్ నమోదు చేశారు. ఈనెల 8వ తేదీన దీనిపై ఇరుపక్షాల నుంచి వాదనలు వినిపించాల్సి ఉంది. ఈ నేపథ్యంలో శనివారం యంత్రాలను తరలించేందుకు యాజమా న్యం సిద్ధపడిన విషయం తెలిసి కార్మికులు వెళ్లి అడ్డగించారు. పోలీసులు రంగ ప్రవేశం చేసి సమస్యపై చర్చిస్తాం అని చెప్పి కార్మిక సంఘ నాయకులు బాబు, రామ్మూర్తి, రత్నం, నాగూర్, రమేష్, మురగారెడ్డిలను అదుపులోకి తీసుకున్నారు. సాయంత్రం వరకు స్టేషన్‌లో కూర్చొబెట్టారు. ఈ సమయంలో మిల్లు యాజమాన్యం ముందుగా చేసుకున్న ఏర్పాట్లతో కొంతమేర యంత్రాలను తరలించారు. అనంతరం కార్మికులను పోలీసులు పంపేశారు.

అలరించిన దుర్యోధన వధ


దుర్యోధన వధ సన్నివేశాన్ని ప్రదర్శిస్తున్న వేషధారులు


దుర్యోధన వధ ఘట్టాన్ని తిలకించేందుకు వచ్చిన అశేష భక్తులు

కార్వేటినగరం: కార్వేటినగరంలో వెలసిన శ్రీద్రౌపదీ, ధర్మరాజుల స్వామివారి ఆలయంలో నిర్వహిస్తున్న వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం దుర్యోధన వధ ఘట్టం అట్టహాసంగా జరిగింది. ఉదయం ఆలయ అర్చకులు ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు చేపట్టి భక్తులకు సర్వదర్శనం కల్పించారు. మధ్యాహ్నం భాగవతారిణి రెడ్డెమ్మ హరికథా కాలక్షేపాన్ని కనులకు కట్టినట్లు ఆలపించారు. సాయంత్రం శ్రీవేంకటేశ్వర నాటక కళామండలి ఆధ్వర్యంలో దుర్యోధన వధ ఘట్టాన్ని ప్రదర్శించారు. దుర్యోధనున్ని భీమసేనుడు గంగమడుగు నుంచి బయటకు రప్పించే ఘట్టం చూపరులను విశేషంగా ఆకట్టుకుంది. దుర్యోధన పాత్రధారుడు ఆలపించిన పద్యాలు పలువురిని కంటతడి పెట్టించాయి. దుర్యోధన వధ కార్యక్రమ ఉభయదారులుగా తూర్పు వీధివారు వ్యవహరించారు. అలాగే 2003లో పదోతరగతి చదివిన పూర్వ విద్యార్థులు ఆలయ ఆవరణలో వెయ్యిమందికి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

నేడు అగ్ని గుండప్రవేశం

శ్రీద్రౌపదీ ధర్మరాజుల స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం అగ్నిగుండ ప్రవేశం ఉంటుందని ఆలయ అధ్యక్షుడు సోమనాథ్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదివారం సాయంత్రం ఆలయ ఆవరణలో అగ్నిగుండ ప్రవేశం ఉంటుందన్నారు. మొక్కులు ఉన్న భక్తులు అగ్నిగుండ ప్రవేశానికి రూ.400 చెల్లించి కంకణం ధరించాలన్నారు. మహిళలకు అగ్నిగుండ ప్రవేశం లేదని, మొక్కులు ఉన్న మహిళలు కంకణాలు ధరించి అగ్నిగుండం చుట్టూ ప్రదక్షిణ చేసి మొక్కులు తీర్చుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు హరిబాబు, శివప్రకాష్, బాబురెడ్డి, కృష్ణయ్య, పలువురు పాల్గొన్నారు.

పారదర్శక పాలనకే జగనన్న సురక్ష


అర్హులకు ధ్రువపత్రాలను అందిస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు


కార్వేటినగరం: ధ్రువపత్రాలను అందిస్తున్న ఎంపీపీ లత


పాలసముద్రం: ధ్రువీకరణ పత్రం అందిస్తున్న అధికారులు


వెదురుకుప్పంలో..


నింద్రలో..


సర్టిఫికెట్ అందిస్తున్న తహసీల్దార్ వెంకటరాయులు

శ్రీరంగరాజపురం: అర్హులందరికీ పథకాలు, సంతృప్తికర ప్రభుత్వ సేవలు అందించాలన్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆశయాలకు అనుగుణంగా 'జగనన్న సురక్ష' నిర్వహిస్తున్నట్లు కార్యక్రమ మండల ప్రత్యేక అధికారి ప్రసాద్ అన్నారు. మండలంలోని 49 కొత్తపల్లిమిట్ట, ముద్దుకుప్పం సచివాలయ పరిధిలో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ సభ్యుడు రమణప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో విప్లవాత్మకమైన మార్పులతో పారదర్శక పాలనకు నాంది పలికారని అన్నారు. అర్హత ఉండి ఇంకా ఎవరికైనా సంక్షేమ పథకాలు అందకుండా ఉంటే 'జగనన్న సురక్ష' కార్యక్రమంలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. నేరుగా ప్రభుత్వ అధికారులు మీ ఇంటికి వచ్చి సంక్షేమ పథకాలు అందించడం జరుగుతుందన్నారు. అనంతరం జగనన్న సురక్ష కార్యక్రమంలో దరఖాస్తు చేసుకున్న వారికి ధ్రువపత్రాలను అందించారు. కార్యక్రమంలో సర్పంచ్ ధిల్లయ్య, గిరిబాబు, ఎంపీటీసీ సిద్ధయ్య, మండల కన్వీనర్ మణి, తహసీల్దార్ లోకనాథపిళ్లై, ఎంపీడీఓ కృష్ణయ్య, నాయకులు మాజీ సర్పంచ్ విజయ, ఏసయ్య, బాబు, జనార్దన్, భూపతిరెడ్డి, శీనయ్య పాల్గొన్నారు.

కార్వేటినగరంలో..

కార్వేటినగరం: సమస్యల పరిష్కారమే జగనన్న సురక్ష ముఖ్య ఉద్దేశమని ఎంపీపీ లత అన్నారు. శనివారం మండల పరిధిలోని సీడీ కండ్రిగ, అన్నూరు గ్రామాల్లో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ మోహన్‌మురళి, తహసీల్దార్ రవికుమార్‌రాజు, డీటీ లక్ష్మీపతి సర్పంచ్ మంగమ్మ, ఎంపీటీసీ నందిని, ఏఎంసీ డైరెక్టర్ ఆకుల గోపి, పలువురు సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పాలసముద్రంలో..

పాలసముద్రం: అర్హులైన వారికి సంతృప్తికర స్థాయిలో ప్రభుత్వ పథకాలు అందించడమే జగనన్న సురక్ష కార్యక్రమం లక్ష్యమని జెడ్పీటీసీ సభ్యుడు అన్నకగన్, మండల కన్వీనర్ తులసిరామ్ యాదవ్ తెలిపారు. శనివారం వనదుర్గాపురం గ్రామ సచివాలయ ఆవరణలో ఎంపీడీఓ ప్రేమ్ రాజ్‌కుమార్, తహసీల్దార్ బాబు ఆధ్వర్యంలో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న సురక్ష కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో సర్పంచ్ నరసింహరాజు, రైతు భరోసా చైర్మన్ పోలయ్య, ఎంపీటీసీ గోవిందరాజు, మండల విస్తరణాధికారి రమేష్, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు, గ్రామస్తులు పాల్గొన్నారు.

వెదురుకుప్పంలో..

వెదురుకుప్పం: ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అందరికీ అందాలన్నదే జగనన్న సురక్ష ప్రధాన ధ్యేయమని జెడ్పీటీసీ సభ్యుడు సుకుమార్ అన్నారు. శనివారం మండలంలోని ఆళ్లమడుగు, బ్రాహ్మణపల్లె గ్రామ సచివాలయాల్లో గ్రామసభలు నిర్వహించారు. సింగిల్‌విండో అధ్యక్షుడు లోకనాథ రెడ్డి, ఎంపీడీఓ సుధాకరరావు, తహసీల్దార్ సత్యనారాయణ, ఈఓపీఆర్డీ పురుషోత్తం, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పద్మనాభ రెడ్డి, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి బండి హేమసుందర్‌రెడ్డి, బీసీ సెల్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి బట్టే సుబ్రమణ్యం, ఏఎంసీ మాజీ ఉపాధ్యక్షుడు రామయ్య, నాయకుడు పేట ధనుంజయరెడ్డి, సచివాలయ కన్వీనర్ వెంకటేశ్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నింద్రలో..

నింద్ర: అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించడమే లక్ష్యంగా జగనన్న సురక్ష పథకం ఉద్దేశమని ఎంపీపీ దీప అన్నారు. శనివారం అగరం సచివాలయం పరిధిలో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ అరుణ, తహసీల్దార్ అమరేంద్రబాబు, సచివాలయ ప్రత్యేకాధికారి తులసీరామ్, సర్పంచ్ చెల్లెమ్మ పాల్గొన్నారు.

విజయపురంలో..

విజయపురం : ప్రజా సమస్యలను 100 శాతం పరిష్కరించడానికే జగనన్న సురక్ష పథకాన్ని ప్రభుత్వం అమలు చేస్తోందని ఎంపీపీ జమున అన్నారు. శనివారం విజయపురం సచివాలయ ఆవరణంలో తహసీల్దార్ వెంకటరాయులు జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ప్రసాద్, ఏఓ రజినికుమారి, సర్పంచ్ మురళీకృష్ణారెడ్డి పాల్గొన్నారు.